
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
మంగళవారం 10 సెప్టెంబరు 2024




నారాయణపూర్ గ్రామం


కలెక్టరేట్‌లో కాళోజీ జయంతిలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

భావితరానికి స్ఫూర్తి కాళోజీ

కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాళోజీ జీవితం, రచనలు భావి తరాలకు స్ఫూర్తి దాయకమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ ఆడిటోరియంలో కాళోజీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కాళోజీ తన రచనల ద్వారా ప్రజా చైతన్యంలో కీలక భూమిక పోషించారన్నారు. ఆయన రచనలు ప్రతి ఒక్కరినీ ఆలోచింప జేస్తాయని తెలిపారు. అక్షరం ద్వారా లక్షల మందిని కదిలించవచ్చని, ఆయన ఆలోచనలు నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీకిరణ్, ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా రెవెన్యూ అధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.


నారాయణపూర్ రిజర్వాయర్

> నారాయణపూర్, గంగాధర ఎల్లమ్మ చెరువులను కలిపి 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రిజర్వాయర్‌గా ఏర్పాటు చేసింది. దీంతో నారాయణపూర్, మంగపేట, చర్లపల్లి(ఎన్) గ్రామాలకు ఇబ్బందులు మొదలయ్యాయి. ఇళ్లు, వ్యవసాయ భూములు రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్నా ఇప్పటికీ పరిహారం అందలేదు. ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం పునరావాసం కల్పించలేదు. రిజర్వాయర్ నిండిన ప్రతిసారి మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

మా కష్టాలు పట్టించుకోరా?

నారాయణపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల ఆవేదన

20 ఏళ్లుగా పరిహారం, పునరావాసం కోసం ఎదురుచూపులు

గంగాధర, సెప్టెంబరు 9: సాగు నీటి ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయి నిర్వాసితులుగా మారిన కుటుంబాలు, పరిహారం పునరావాసం కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్నాయి. ప్రభుత్వాలు మారినా ముంపు గ్రామాల సమస్య పరిష్కారం కావడం లేదు. యేటా ప్రాజెక్టులో నీరును నింపుతుండగా రిజర్వాయర్ నుంచి విషపురుగులతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తుండగా కొన్ని కుటుంబాలు ఊరు విడిచి పక్క గ్రామాల్లో అద్దెకు ఉంటున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా, పాలకులు మారుతున్నా పరిహారం అందించక, పునరావాసం కల్పించక ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని నారాయణపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● రెండు చెరువులు కలిపి రిజర్వాయర్‌గా..

గంగాధర మండలం నారాయణపూర్ చెరువు, గంగాధర ఎల్లమ్మ చెరువులు ఒకప్పుడు సాధారణ చెరువులు. ఈ రెండు చెరువులను కలిపి రిజర్వాయర్‌గా ఏర్పాటు చేసి చొప్పదండి, వేములవాడ నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు సాగునీరందిం చాలని అప్పటి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఫేస్ 1, 2లో పనులు చేపట్టింది.

ఎల్లంపల్లి నుంచి పైపులైను వేసి నాలుగేళ్లుగా నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇప్పటికే రిజర్వాయర్ ఎడమ కాలువ పూర్తయింది. పదేళ్ల పోరాడగా మంగపేట రైతులకు గత ఏడాది 86 ఎకరాలకు పరిహారం అందించారు. రిజర్వాయర్ చేయకముందు సాధారణ చెరువులుండగా నీరు తక్కువగా వస్తుండేది. ప్రాజెక్టుగా మార్చడంతో ఎల్లంపల్లి నీటిని ఎత్తిపోస్తుండగా అప్పటి నుంచి నారాయణపూర్, మంగపేట, చర్లపల్లి(ఎన్) గ్రామాలకు ఇబ్బందులు మొదలయ్యాయి. మంగపేటలో ఎనిమిది ఇళ్లలోకి నీరు చేరుతుందని అధికారులు ముంపు కింద ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు.

ఈ ఇళ్లకు రూ 1.82కోట్ల పరిహారం అందించాల్సి ఉంది. ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ కింది పునరావాసం ఏర్పాటు చేయాల్సి ఉంది. 20 ఏళ్లుగా రిజర్వాయర్ నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుడి కాలువ కింద, రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న వ్యవసాయ భూములకు పరిహారం అందించి ఇళ్లకు ఇవ్వక పోవడంతో నిర్వాసితులు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.

● ఎన్నో కష్టాలు

నారాణయపూర్ రిజర్వాయర్‌ను నింపడంతో కట్టను ఆనుకుని ఉన్న ఇళ్లలో ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని ఇళ్ల గోడలకు చేరింది. రిజర్వాయర్‌లోని విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌తో చర్లపల్లి(ఎన్) గ్రామంలోని పలు ఇళ్లలోకి నీరు చేరుతోంది. ఈ రెండు గ్రామాల్లో కనీసం బాత్ రూంకు వెల్లుదామన్నా వెళ్లలేని పరిస్థితి ఉంది. సెప్టిక్ ట్యాంకులు నిండి బయటికి నీరు వస్తోంది. ఐదు సంవత్సరాలుగా నీరు ఇళ్లలోకి రావడంతో బాధలు తట్టుకోలేక కొన్ని కుటుంబాలు ఊరు విడిచి వేరే గ్రామాల్లో నివాస ముంటున్నాయి. ఇరవై ఏళ్లుగా ముంపు గ్రామాలకు పున రావాసం కల్పించాలని చేస్తున్న వినతులను ప్రజాప్రతి నిధులు, అధికారులు పట్టించుకోవడంలేదు. అధికారులు త్వరగా పరిహారం అందించి ముంపు సమస్యకు పరిష్కా రం చూపాలని కోరుతున్నారు.


మంగపేట గ్రామం


ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

జిల్లా ఆసుపత్రి సమస్యలు పరిష్కరిస్తాం

- **ప్రాథమిక అవసరాలు వెంటనే తీర్చాలి**
- **ఎంసీహెచ్‌లో మరో వంద పడకలను అందుబాటులోకి తేవాలి**
- **మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం**

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: జిల్లా ఆసుపత్రి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి ద్వారా ఆసుపత్రి సమస్యలు, కావలసిన సదుపాయాలు, సౌకర్యాలు, ఇతర సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, 150 ఏసీలు కావాలని, ఆపరేషన్ థియేటర్‌లో పరికరాలు అవసరమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రికి రెండు అంబులెన్స్‌లు అవసరమని, పేయింగ్ రూములకు డిమాండ్ ఎక్కువ ఉందని, చిన్నచిన్న రిపేర్లు ఉన్నాయని, వాటిని చేపిస్తే ఆసుపత్రికి ఆదాయం పెరుగుతుందన్నారు. ఆసుపత్రిలో ఆర్వో ప్లాంట్లు రిపేరులో ఉన్నాయని, వాటిని బాగు చేయించాలని, మార్చురీ డబుల్ బాడీ ఫ్రీజర్ అవసరమని తెలిపారు.

కోటి 38 లక్షల కరెంటు బిల్లు పెండింగ్‌లో ఉందని బడ్జెట్‌ను విడుదల చేయాలని మంత్రిని కోరారు. ఆసుపత్రికి అవసరాల కోసం రోటరీ క్లబ్ వారు 36 లక్షల రూపాయలను ఇస్తామన్నారని, అందుకు ముందుగా ప్రభుత్వం నుంచి తొమ్మిది లక్షల నిధులు విడుదల చేయాలని కోరారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆసుపత్రిలోని డ్రైనేజీ సమస్యను 15 రోజుల్లో పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఏసీల ఏర్పాటును తానే చూస్తానన్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రెండు కొత్త అంబులెన్స్‌లను కొనుగోలు చేయాలని సూచించారు.

రోటరి క్లబ్ వారు అందిస్తామన్న రూ. 36లక్షల కోసం కావలసిన తొమ్మిది లక్షలను మంజూరు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని వంద పడకలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది ఖాళీలకు సంబంధించిన వివరాలను అందిస్తే భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం దాతలు ఎవరైనా విరాళాలు ఇవ్వవచ్చని కోరారు. సమావేశంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్, డాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.


హాజరైన డాక్టర్‌లు, వైద్య సిబ్బంది

ప్రజావాణికి 227 దరఖాస్తులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: ప్రజావాణి కార్యక్రమానికి 227 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ పమేలాసత్పతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణి దరఖా స్తులకు సంబందించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మి కిరణ్, ట్రైని కలెక్టర్ అజయ్‌యాదవ్ పాల్గొన్నారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో ఉండాలి


సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే పాయల శంకర్

- **పని చేసేవారికే స్థానిక ఎన్నికల్లో టికెట్లు**
- **కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్**

భగత్‌నగర్, సెప్టెంబరు 9: పార్టీ సభ్యత్వ నమోదులో కరీంనగర్ అగ్రస్థానంలో ఉండాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని టవర్ సర్కిల్ వద్ద నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్య క్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం, సమాజం కోసం పనిచేసే ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. 18 కోట్ల సభ్యత్వ నమోదు చేసి ప్రపంచ రికార్డు సృష్టించిందన్నారు. ఈ సారి మరో పది కోట్ల మందిని సభ్యులుగా చేర్చాలని అధిష్టానం నిర్ణయించిందన్నారు. తెలం గాణలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 77 లక్షల మంది ఓటేశారన్నారు. వారందరినీ సభ్యులుగా చేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలువాలంటే ఎక్కువ మందిని బీజేపీ సభ్యులుగా చేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలవాల నుకునేవారికి ఇది మంచి అవకాశమన్నారు. పనిచేసే వారికి టికెట్లు ఇస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అవుట్ డేటెడ్ పార్టీ అని రాష్ట్ర ప్రజలంతా నో ఎంట్రీ బోర్డు పెట్టారన్నారు. కేసీఆర్ ఎన్నియాగాలు చేసినా ఉపయోగం ఉండదన్నారు. బిడ్డ జైలు నుంచి రాగానే యాగాలు చేస్తున్నాడని, చేతనైతే వరదల వల్ల నష్టపోయిన వారి కోసం కేసీఆర్‌యాగాలు చేయాలన్నారు. వరదలపై కేసీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. వరదలపై ప్రధాని, కేంద్ర హోం శాఖ మంత్రి ముఖ్యమంత్రితో మాట్లాడారన్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి ఏరియల్ సర్వేచేశారన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేత కనీసం వరద బాధితులను పరామర్శించలేదన్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో విరక్తి మొదలైందన్నారు. ఆ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల నుంచి చర్చను మళ్లించేందుకే హైడ్రా పేరుతో డ్రామాలు మొదలు పెట్టిందని విమర్శించారు. చెరువుల్లో నిర్మాణాలు అక్రమమని తెలిసీ ఎందుకు అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. మొదట అక్రమంగా కట్టుకున్న భవనాలు, విల్లాలు, ఫాంహౌస్‌లను కూలిస్తే సమర్థించామని తెలిపారు. పొట్ట కూటి కోసం వ్యాపారం చేసుకునే షాపులను, పేదల ఇళ్లను కూలుస్తున్నారని.. ఇకపై ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఆదిలాబాద్‌శాసన సభ్యుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ దేశం ఫస్ట్, పార్టీ నెక్స్ట్, వ్యక్తి లాస్ట్ అనే నినాదంతో పనిచేయాలన్నారు. బీజేపీలో ప్రతి ఒక్కరూ చేరాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వ నమోదులో కార్యకర్తలు ముందుండాలన్నారు. జైనూరులో ఆదివాసీ మహిళపై లైంగిక దాడి చేసి హత్యాయత్నం చేసిన గుండాలను ఎంఐఎం సమర్థిస్తుండడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు ఆంటోనిరెడ్డి పాల్గొన్నారు.

పేదల భూములు లాక్కుంటే తిరుగుబాటు తప్పదు

డంప్‌యార్డును వెంటనే ఎత్తివేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: జమ్మికుంటలో ప్రభుత్వం పేదలకు నివేశన స్థలాలకే కేటాయించిన స్థలాన్నే డంపింగ్ యార్డుకు కేటాయించిందని, దానిని వెంటనే రద్దు చేసి, పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006-2007లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలను గుర్తించి జమ్మికుంట పరిధిలోని సర్వే నంబరు 275, 277, 278లో 370 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. పట్టాలు ఇచ్చిన పాలకులు వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. కొంతమంది ఇంటిని నిర్మించుకుని అక్కడ నివాసం ఉంటున్నారని తెలిపా రు. ఇప్పుడు అదే స్థలాన్ని డంపింగ్ యార్డుకు కేటాయించామని రెవెన్యూ అధికారులు చెప్పడం సిగ్గు చేటన్నారు. పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులే ఇలా చేయడం దుర్మార్గమన్నారు. కలెక్టర్, మంత్రులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. వెంటనే డంపింగ్ యార్డును ఎత్తివేసి, ఇందిరమ్మ ఇళ్ళ పథకం కింద ఐదులక్షలు, కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు నిధులు మంజూరు చేసి వారికి కేటాయించిన స్థలంలోనే ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. తాగునీటి సౌకర్యం, కరెంటు, రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డి నరేష్, నాగిశెట్టి వెంకటేశ్వర్లు, పూదరి అనంత, పిక్కల సమ్మయ్య గొర్రె స్వరూప, మాదాసు రవీందర్ పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న జమ్మికుంటకు చెందిన బాధిత మహిళలు, సీపీఎం నాయకులు

ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయి నీటి నిల్వలు

ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటి నిల్వలకు చేరువలో ఉన్నాయి. ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో నీటి పారుదల శాఖ అధికారులు పరిస్థితినిబట్టి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల వరద గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. ఎల్‌ఎండీ నుంచి కాకతీయ కాలువ ద్వారా ఆదివారం దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు సోమవారం నిలిపివేశారు.


నిండు కుండలా ఎల్‌ఎండీ

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం 42,157 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 42,157 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అయిదు వరద గేట్ల ద్వారా 15,620 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,000 క్యూసెక్కులు, వరద కాలువకు 18,000 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తికి 4,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 666 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

● పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 1,23,094 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దీంతో అధికారులు సోమవారం 20 గేట్లు ఎత్తి 1,07,650 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెట్టారు. శనివారం రాత్రి వరకు ప్రాజెకు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉండడంతో పైనుంచి వరద నీటిని అంచనా వేస్తూ శ్రీపాద ఎల్లంపల్లి గేట్లను ఎత్తి గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టుపూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 18.702 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

● బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి 15925 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి 13,400, మూలవాగు, మానేరు వాగు ద్వారా 2,525 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్‌ఎండీ ప్రాజెక్టుకు ఆరు గేట్ల ద్వారా 10,300, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 316.17 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 23.03టీఎంసీల నీరు ఉంది.

● తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా ఆదివారం దిగువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన ఇరిగేషన్ అధికారులు సోమవారం మధ్యాహ్నం నిలిపివేశారు. అన్ని చోట్ల విరివిగా వర్షలు కురుస్తుండడం, వాగులు, కుంటలు, చెరువులు పొంగి పోర్లుతుండడంతో నీటి విడుదలను నిలిపివేసినట్లు తెలిసింది. మిడ్ మానేరు నుంచి వచ్చే నీరు 10 వేల క్యూసెక్కులకు తగ్గింది ఎల్‌ఎండీ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా సోమవారం రాత్రి వరకు 22.824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 623 క్యూసెక్కులు, ఎంఎంఆర్ నుంచి 10,300, ఎగువ నుంచి 1,050 క్యూసెక్కులు మొత్తం 11,973 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఎల్‌ఎండీలోకి వస్తోంది. మిషన్ భగీరథ, నీటి ఆవిరి రూపంలో 305 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెళుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

వినాయక మండపాల్లో చోరీ

తిమ్మాపూర్, సెప్టెంబరు 9: మండలంలోని మహాత్మానగర్ ఎల్‌ఎండీ కాలనీలోని రెండు వినాయక మండపాల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. వేంకటేశ్వర ఆలయ కల్యాణ మండపం అవరణలోని హోమశాలలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడిని ప్రతిష్ఠించారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హోమశాల తాళం పగలగొట్టి వినాయకుడికి భక్తులు వేసిన కరెన్సీ దండతోపాటు విగ్రహం వద్ద ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లారు. ఆలయంలోని లాకర్‌ను పగలగొట్టేందుకు యత్నించారు. హ్యాండిల్ విరిగిపోవడంతో వెళ్లిపోయారు. శివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలోకి దొంగలు చొరబడి వినాయకుడికి తొడిగిన రాగి తొండంను ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై ఎల్‌ఎండీ పోలీసులకు సమాచారం అందించినట్లు మండపాల నిర్వాహకులు తెలిపారు.

'ఎస్సీ సంక్షేమ హాస్టళ్లను ప్రారంభించాలి'

గణేశ్‌నగర్, సెప్టెంబరు 9: ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను ప్రారంభించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ సంక్షేమ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రవణ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్షుడు ఎల్కటూరి ఇషక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మూడు ఎస్సీ సంక్షేమ ప్రభుత్వ హాస్టల్స్ మంజూరయ్యాయన్నారు. వాటిని ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వాటిని వెంటనే ప్రారంభించాలని ఆయన కోరారు. ప్రభుత్వం మంజూరు చేసినా ఎందుకు ప్రారంభించకుండా కాలం గడుపుతున్నారని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా చాలా మంది విద్యార్థులు హాస్టళ్లలో సీట్లు రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. సంక్షేమ హాస్టల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే విద్యార్థులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చారించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు గట్టు ఆకాష్, గన్నరపు రాకేష్, అంబాల సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

'నష్టపరిహారం ఇప్పించండి'

రామడుగు, సెప్టెంబరు 9: భారీ వర్షాలతో నష్టపోయిన తమకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని మత్స్యకారులు కోరారు. ఈ మేరకు రామడుగు మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటలక్ష్మికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని షానగర్ ఎల్లమ్మ చెరువు కట్టకు గండిపడిందన్నారు. చెరువులోని చేపలన్నీ కొట్టుకు పోయి పది లక్షల నష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు జిట్టవేణి రాజు, ఉపాధ్యక్షులు రవి, నర్సయ్య, లక్ష్మీపతి, బసరవేని రాజయ్య పాల్గొన్నారు.

తిప్పన్నపేటలో ప్రబలిన జ్వరాలు


తిప్పన్నపేట లో పరీక్షలు చేస్తున్న మాతా శిశు సంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 9: జగిత్యాల మండలం తిప్పన్నపేటలో జ్వరాలు ప్రబలాయి. జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో జగిత్యాల జిల్లా మాత శిశుసంరక్షణ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పలు ఇళ్లను పరిశీలించి జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు.

హైడ్రా వల్ల సామన్యులకు ఇబ్బందులు ఉండవు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: హైడ్రా వల్ల సామాన్యులకు ఎటువంటి ఇబ్బందులు కలగనీయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. హైడ్రాపై బీజేపీ నాయకులు నలుగురు నాలుగు రకాలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలు సక్రమంగానే జరుగుతుందన్నారు. ప్రతి పక్షాలకు ఏం మాట్లాడాలో తెలియడం లేదన్నారు. ఏదో ఒక స్టేట్‌మెంట్ ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. న్యాయ స్థానాలు ఇచ్చే తీర్పులను గౌరవిస్తామన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు విషయాన్ని శాసనసభ వ్యవహారాల మంత్రి, అధికారులు చూసుకుంటారని అన్నారు.

'చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి'

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 9: తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా కమిటీల ఆధ్వర్యంలో చాకలి వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు వనపర్తి శంకర్, పైడి కొమురయ్య, రాచకొండ నరేశ్, జిల్లా అధ్యక్షుడు పూసాల శ్రీకాంత్, ఉపాధ్యక్షులు నేరెళ్ల లక్ష్మన్, తడిగొప్పుల శ్రీపాల్, కార్యదర్శి మునిగంటి అశ్విన్ పాల్గొన్నారు.

కరీంనగర్‌లోనూ హైడ్రా లాంటి వ్యవస్థ ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: హైదరాబాద్ తరహాలో కరీంనగర్‌లోనూ హైడ్రా లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బి) జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కమిటీ సభ్యుడు బెక్కంటి రమేశ్‌తో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో చెరువు శిఖం భూములను, నాళాలు, పార్కులను కబ్జాదారుల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో చెరువులు, కుంటలు అదృశ్యం కావడానికి ప్రధాన కారకులు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపాలిటి అధికారులేనని విమర్శించారు. అధికారుల అండదండలతో కొంతమంది రాజకీయ నాయకులు, కబ్జాదారులు కుమ్మక్కై పెద్దఎత్తున చెరువులు, కుంటలను మాయం చేస్తున్నారన్నారు.

ప్రజల ప్రాణాలతో ఆర్ఎఫ్‌సీఎల్ చెలగాటం

● అమ్మోనియా వ్యర్థాలను డ్రైనేజీలు, గోదావరిలోకి వదులుతున్న యాజమాన్యం ● ఏడాదిలో జెడ్ఎల్‌డీ పెడతామంటూ పీసీబీకి హామీ ● మూడేళ్లు గడుస్తున్నా ఊసే లేదు

కోల్‌సిటీ, సెప్టెంబరు 9: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ నుంచి చుక్క నీరు బయటకు పోదని, వ్యర్థాల ఊసే ఉండదని, ఉత్పత్తికి వినియోగించిన నీటిని శుద్ధి చేసి ప్లాట్ టౌన్ షిప్‌లో మొక్కల పెంపకానికి వినియోగిస్తామంటూ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో ఊదరగొట్టింది. ఏడాదిలో జీరో లిక్విడ్ డిశ్చార్జి(జెడ్ఎల్‌డీ)నిర్మిస్తామని కాలుష్య నియంత్రణ మండలికి హామీపత్రం ఇచ్చింది. ఉత్పత్తి ప్రారంభమై మూడేళ్లు గడుస్తున్నా జెడ్ఎల్‌డీ ఊసే లేదు. జెడ్ఎల్‌డీ నిర్మించిన తరువాతే ఉత్పత్తి ప్రారంభించాల్సి ఉండగా జెడ్ఎల్‌డీ నిర్మాణం లేకుండానే ప్రాజెక్టుకు కాలుష్య నియంత్రణ మండలి కాన్సెంట్ ఆఫ్ ఆపరేషన్ ఇచ్చేసింది. గత ఏడాది రూ.328కోట్ల నికర లాభాలను ఆర్జించిన సంస్థ జెడ్ఎల్‌డీకి రూ.170కోట్లు పెట్టేందుకు వెనుకాడుతోంది. జెడ్ఎల్‌డీ నిర్మాణానికి ఫిబ్రవరిలో టెండర్లు ఆహ్వానించి తరువాత వదిలేసింది. ప్లాంట్ నుంచి వెలువడే రసాయనిక వ్యర్థాలను నేరుగా గోదావరిలోకి వదులుతున్న సంస్థ తాజాగా లీకేజీ అయిన అమ్మోనియాను నేరుగా మున్సిపల్ డ్రైన్లలోకి వదిలింది. అమ్మోనియా ఘాటుకు వేల మంది జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం మాత్రం నోరు మెదపడం లేదు.

రామగుండం ఎరువుల కర్మాగారం నిర్మాణ సమయంలో ప్లాంట్‌లో జెడ్ఎల్‌డీ పెడతామని, తరువాతే ఉత్పత్తి ప్రారంభిస్తామని ప్రభుత్వానికి ప్రాజెక్టు నివేదిక ఇచ్చింది. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో జనం ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి వెలువడే వ్యర్థాలపై ఆందోళన వెలిబుచ్చారు. ప్లాంట్‌లో జెడ్ఎల్‌డీ పెడతామని, చుక్క నీరు కూడా బయటకు రాదని పేర్కొన్నది. సాధారణంగా చిన్నచిన్న పరిశ్రమల్లో సైతం ఉత్పత్తికి ముందే జెడ్ఎల్‌డీ నిర్మాణం జరుగుతుంది. కానీ ఆర్ఎఫ్‌సీఎల్‌లో మాత్రం జెడ్ఎల్‌డీ నిర్మాణమే జరుపలేదు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి 2021-22ఆర్థిక సంవత్సరంలో అమ్మోనియా లీకేజీ కావడంతో జనం ఆందోళనకు దిగారు. ఒక సందర్భంలో కాలుష్య నియంత్రణ మండలి ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిపి వేయించింది. కేంద్రం జోక్యం చేసుకుంది. ఆ సమయంలో ఏడాదిలో జెడ్ఎల్‌డీ నిర్మిస్తామంటూ పీసీబీకి రాతపూర్వక హామీ ఇచ్చింది.


విఠల్‌నగర్ డ్రైనేజీలోఆర్ఎఫ్‌సీఎల్ నీరు


వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్న విఠల్‌నగర్ వాసులు (ఫైల్)

● జెడ్ఎల్‌డీ అంటే...

ఫెర్టిలైజర్స్ ఇండస్ట్రీస్‌లో నీటి కాలుష్యం జరుగుతుంది. ముఖ్యంగా అమ్మోనియా ఉత్పత్తి సమయంలో వ్యర్థాలు వెలువడుతాయి. జెడ్ఎల్‌డీ(జీరో లిక్విడ్ డిశ్చార్జి)కి సంబంధించి మూడు స్టేజీల్లో ట్రీట్‌మెంట్ జరుగుతుంది. మొదట వ్యర్థ జలాల నుంచి వ్యర్థాలను తొలగించడం, తరువాత వ్యర్థాలను ఘన రూపంలోకి, ద్రవరూపంలోకి మార్చుతారు. నీటిని పూర్తిగా శుద్ధి చేసి తిరిగి పారిశ్రామిక అవసరాలకు వినియోగించడం లేదా ప్లాంట్లలో గ్రీనరీకి వాడడం చేస్తారు. ఆర్ఎఫ్‌సీఎల్ కూడా వ్యర్థ జలాలను శుద్ధి చేసి చెట్ల పెంపకానికి వాడతామంటూ ప్రాజెక్టు రిపోర్టులో పేర్కొన్నది.

● ప్రజలకు, పర్యావరణానికి ముప్పు

ఆర్ఎఫ్‌సీఎల్ వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా వదులుతుండడంతో జిల్లాలోని అమ్మోనియా, సోడియం, ఇతర న్యూట్రియన్స్, ప్రమాదకరమైన వ్యర్థాలు అందులో ఉంటున్నాయి. దీంతో గోదావరి జలాలు, సమీప కాలనీల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. రెండు రోజుల క్రితం ప్లాంట్‌లో నుంచి అమ్మోనియా వ్యర్థాలను నేరుగా మున్సిపల్ డ్రైన్‌లో కలుపడంతో రామగుండం నగరంలోని వేలాది మంది ఇబ్బంది పడ్డారు.

● టెండర్లు పిలిచినా ముందుకు సాగని పనులు

ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థ 2022-23లో రూ.8.59కోట్లు, 2023-24లో రూ.4,941 కోట్ల టర్నోవర్‌తో 328 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది. 170కోట్ల రూపాయల అంచనాలతో జెడ్ఎల్‌డీ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది. 180రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. జూన్‌లో టెండర్ల ప్రక్రియ పూర్తయి నిర్మాణం ప్రారంభించాల్సి ఉంది.

రూ.7,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, సెప్టెంబర్ 9: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,700 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 49క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,700, కనిష్ఠ ధర రూ.7,650 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

వృథాగా దామెర చెరువు నీరు


దామెర చెరువు తూము నుంచి పోతున్న నీరు

శంకరపట్నం, సెప్టెం బరు 9: శంకరపట్నం మండలం మొలంగూర్ దామెర చెరువు తూము తెరిచి ఉండడంతో చెరువులో నీరు దిగువ కు వృథాగా పోతోంది. చెరువు తూము తెరిచి ఉంచడంతో నీరు దిగు వకు వెళ్లిపోయి వేసవిలో అవసరాలకు నీరు లేకుండా పోతుందని ఆవేదన చెందారు. నీరు దిగువకు పోవడంతో కింద ఉన్న పొలాలు నీట మునిగి పంట నష్టం వాటిల్లుతుందన్నారు. సంబంధిత శాఖాధికారులు వెంటనే స్పందించి తూము ద్వారా నీరు పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆస్తిలో వాటా కోసం అంత్యక్రియలను అడ్డుకున్న భార్య

● పోలీసులు, పెద్దల జోక్యంతో కార్యక్రమాలు పూర్తి

మంథని, సెప్టెంబర్ 9: భర్త ఆస్తిలో తన కొడుకుకు వాటా కోసం భర్త అంత్యక్రియలను భార్య అడ్డుకున్న సంఘటన పెద్దపల్లి జిల్లా మంథని గోదావరినది తీరంలో సోమవారం జరిగింది. మంథని మండలంలోని విలోచవరం గ్రామానికి చెందిన సురేష్‌కు సంధ్యతో మూడు సంత్సరాల క్రితం వివాహం కాగా వారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. వీరికి ఒక కొడుకు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య నెలకొన్న కుటుంబ కలహాల కారణంగా సంధ్య కొంత కాలంగా సురేష్‌కు దూరంగా ఉంటోంది. ఈక్రమంలో సురేష్(30) హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులు మంథని గోదావరి నది తీరానికి తీసుకువచ్చారు. విషయం తెలిసిన భార్య సంధ్య తన కొడుకుతో పాటు మంథని గోదావరినది తీరానికి చేరుకొని భర్త ఆస్తిలో తన కొడుకు వాటా తేల్చాకే అంత్యక్రియలు జరపాలని అడ్డుకున్నారు. భర్త తరుపున కుటుంబ సభ్యులు నచ్చజెప్పినప్పటికీ వినలేదు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు, ఇరువర్గాలకు చెందిన పెద్ద మనుషులు కర్మకాండలు ముగిశాక ఆస్తి గుర్పించి చర్చిద్దామని నచ్చజెప్పడటంతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

జ్వరంతో ఇద్దరి మృతి

వెల్గటూర్, సెప్టెంబరు 9: మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో జ్వరంతో బాధపడుతూ అవ్వ లింగమూర్తి (45) అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగమూర్తి జ్వరంతో బాధ పడుతూ జగిత్యాల ఆసుపత్రిలో చేరాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబీకులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు.

● ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని హనుమాన్ వీధికి చెందిన గజ్జల రామ్ చరణ్(10) అనే 4వ తరగతి విద్యార్థి జ్వరంతో సోమవారం మృతి చెందాడు. రామ్‌చరణ్ వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు స్థానికంగా వైద్యం చేయిస్తున్నారు. అయినా కూడా జ్వర తీవ్రత తగ్గలేదు. వైద్యుల సూచన మేరకు రెండు రోజుల క్రితం కరీంనగర్ లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు.

పెద్దాపూర్ గురుకులంలో పూర్తిస్థాయి తరగతులు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో నెల రోజుల తరువాత పూర్తి స్థాయిలో తరగతులు ప్రారంభించారు. సోమవారం ఆరు నుంచి ఇంటర్ వరకు తరగతులను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ మాధవీలత తెలిపారు. పాఠశాలలో వరుసగా జరిగిన సంఘటనలతో తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను నెల రోజుల క్రితం ఇంటికి తీసుకెళ్లారు. తరువాత విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఆన్‌లైన్‌లో తరగతులను నిర్వహించారు. విద్యార్థులకు కావాల్సిన వసతులు కల్పించడానికి సెలవులు ప్రకటించారు. అసంపూర్తిగా ఉన్న నూతన భవనంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వారికి ప్రభుత్వం, సొసైటీ వారి సూచనలతో వసతులు కల్పించడమే కాకుండా కావల్సిన డబుల్ కాట్ బెడ్స్, మౌలిక వసుతులు ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో వసతులు కల్పించిన అనంతరం తరగతులను పూర్తి స్థాయిలో ప్రారంభించారు. దీంతో పాఠశాలకు సోమవారం 225 మంది వచ్చారు. మరి కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి గురుకుల పాఠశాలను పరిశీలించి సోలార్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారని, మిగతా విద్యార్థులు ఈ నెల 15 నుంచి హాజరవుతారని ఉపాధ్యాయులు తెలిపారు.


పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో తరగతులకు హాజరైన విద్యార్థులు

108లో మహిళ ప్రసవం

● తల్లి, బిడ్డను క్షేమంగా ఆసుపత్రికి తరలించిన సిబ్బంది


108 వాహనంలో జన్మనిచ్చిన తల్లి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామానికి చెందిన కలవేన శారద పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. హుటాహుటిన 108 సిబ్బంది శారద ఇంటికి చేరుకుని వెంటనే పెద్దపల్లి మాతా శిశు ఆసుపత్రికి తరలించే క్రమంలో మహిళకు పురిటినొప్పులు అధికమయ్యాయి. వెంటనే 108 ఎమర్జెన్సీ టెక్నీషియన్ నిమ్మతి శ్రీనివాస్ పైలట్ హబీబ్ సహకారంతో కాల్ సెంటర్ ద్వారా వైద్యుల సలహా మేరకు 108 వాహనంలోనే ప్రసవం చేశారు. కలవేని శారద పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వగా తల్లి, బిడ్డను ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దళితబంధు రెండో విడత నిధులు మంజూరు చేయాలి

ఇల్లందకుంట, సెప్టెంబరు 9: రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు రెండో విడత నిధులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద సోమవారం దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా దళితబంధు నిధుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం సరికాదన్నారు. ఈ మేరకు కోతుల బొమ్మలను ప్రదర్శన చేస్తూ మోకాళ్లపై కూర్చొని వినూతన రీతిలో నిరసన తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం హుజూరాబాద్ నియోజకవర్గంలోని మిగిలిన దళితులకు రెండో విడత దళితబంధు నిధులు మంజూరు చేయాలని, లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సురేష్, రాజేష్, ఆకాష్, బిక్షపతి, రక్షిత్, రాకేష్, సరిత, అర్జున్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న దళితబంధు సాధన సమితి నాయకులు

పాఠశాలలో కంప్యూటర్ దొంగిలించిన వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, సెప్టెంబరు9: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ దొంగిలించిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు కోనరావుపేట ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో కంప్యూటర్ అపహరించారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మామిడిపల్లి గ్రామానికి చెందిన మాసం దిలీప్‌ను విచారించగా నేరం ఒప్పుకోవడంతో కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దు

- ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్థుల నిరసన


ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్థులు

గొల్లపల్లి, సెప్టెంబరు 9: గొల్లపల్లి మండలం వెంగళాపూర్ గ్రామానికి సమీపంలో బాయిల్డ్ రైస్‌మిల్లు నిర్మిస్తే తమ పంట పొలాలు దెబ్బ తినడమే కాకుండా అనారోగ్యం పాలవుతామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వెంగళాపూర్ గ్రామానికి చెందిన రైతులు, నాయకులు, యువకులు మండల కేంద్రానికి తరలివచ్చి రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దు అంటూ తహసీల్దార్ జమీర్, ఎంపీడీవో రాంరెడ్డికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ రైస్ మిల్లు ఏర్పాతో గ్రామంలో వాతావరణ కాలుష్యంతో పాటు పొగ, నల్లని బూడిద రావడంతో అనారోగ్యం పాలవుతామని అన్నారు. కార్యక్రమంలో ఇను గంటి గంగన్న, రేగుంట అంజయ్య, వనపర్తి పెద్దిరాజం, దాసరి నాగేశ్, డెక్క రాజనర్సు, కొండ్ర గంగారెడ్డి, వనపర్తి రాజేందర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థినికి గాయాలు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 9: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో సోమవారం విద్యుదాఘాతంతో విద్యార్థిని గాయపడింది. కేసీఆర్‌నగర్‌కు చెందిన కోలిపాక రాము-రూప దంపతుల కుతూరు లాస్య (7) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రెండోతరగతి చదువుతోంది. ఎప్పటిలాగే సోమవారం పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా విద్యుత్ మీటర్లకు అమర్చిన ప్యానల్ బోర్డుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన స్థానికురాలు లాస్యను కాపాడే ప్రయత్నం చేసింది. విద్యుత్ ప్రసారం కావడంతో వదిలేసింది. వెంటనే ఇంట్లో ఉన్న విద్యార్థిని తల్లి రూప కాపాడే ప్రయత్నం చేయగా ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. స్థానికులు కర్రసాయంతో ప్యానల్ బోర్డుకు ఉన్న లాస్య చేతిని తొలగించారు. స్పృహ కోల్పోయిన లాస్యను జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించగా ఐసీయూలో చికిత్స పొందుతోంది.

వేములవాడ నుంచి శృంగేరీకి ప్రత్యేక బృందం

సిరిసిల్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం విస్తరణ పనులలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సోమవారం శృంగేరీ పీఠం జగద్గురు భారతీ తీర్థ, పీఠాధిపతి విదుశేఖర భారతి స్వామిని కలవడానికి వేములవాడ నుంచి ప్రత్యేక బృందం వెళ్లింది. ఆలయ విస్తరణ నమూనాలను బృందం సభ్యులు అందించారు. ఆగమ శాస్త్రాన్ని అనుసరించి విస్తరణ చేపట్టేందుకు అనుమతులు కోరారు. నమూనాలను పరిశీలించిన స్వాములు ఆలయ విస్తరణకు ముందుకెళ్లాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. త్వరలోనే రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని సందర్శించి సూచనలు చేస్తామని తెలిపారు. అనంతరం శృంగేరి పీఠంలోని శారదాంబ అమ్మవారిని ప్రభుత్వ విప్, అధికారుల బృందం సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించింది. శృంగేరి తరలివెళ్లిన వారిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎంవో ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, దేవాదాయ స్థపతి వల్లీనాయకం, శృంగేరి పీఠం తెలంగాణ బాధ్యులు రాధాకృష్ణ, రాజన్న ఆలయ ఈఈ రాజేష్, ఆలయ ప్రధాన అర్చకులు నమిలికొండ ఉమేష్‌శర్మ, చంద్రగిరి శరత్ శర్మ, డీఈ రఘునందన్, అసిస్టెంట్ స్థపతి గణేష్, ఇంజనీర్ అసిస్టెంట్ అంజయ్య ఉన్నారు.


ఆలయ అభివృద్ధి పనుల వ్యూహ్యాన్ని పరిశీలిస్తున్న విధుశేఖర భారతిస్వామి

వానాకాలం తిప్పలే!

● ప్రతియేటా పాపయ్యపల్లెకు తప్పని ఇబ్బందులు

శంకరపట్నం, సెప్టెంబరు 9: ప్రతియేటా వర్షాకాలం ఆ గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు పడితే గ్రామానికి రాకపోకలు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏళ్లుగా కోరుతున్నా రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో సోమవారం శంకరపట్నం గ్రామ పంచాయతీ పరిధిలోని పాపయ్యపల్లె గ్రామస్థులు వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నిరసన తెలిపారు. పాపయ్యపల్లె, కేశవపట్నం గ్రామాల మధ్య వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి వర్షాలతో వరద ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ వర్షాలు పడితే వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నీరు ప్రవహించడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నిత్యం అవసరాల కోసం కేశవపట్నం వెళ్తామన్నారు. ప్రతియేటా వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామన్నారు. కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టి బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు.


లోలెవల్ బ్రిడ్జిపై నిరసన తెలుపుతున్న పాపయ్యపల్లె గ్రామస్థులు

మధ్యాహ్న భోజనం సరిగా లేదని విద్యార్థుల ఆందోళన

ధర్మపురి, సెప్టెంబరు 9: మండలంలోని ఆరెపల్లి జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించడం లేదని విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రతి రోజు మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండటం లేదని పిల్లలు ఆందోళన చేసి పాఠశాల నుంచి వెళ్లిపోయారు. వంటలో పురుగులు, వెంట్రుకలు ఉన్నా అలానే వండి వడ్డిస్తున్నారని విద్యార్థులు వాపోయారు. వంట మనుషులు తమకు వద్దంటూ విద్యార్థులు తెలిపారు. వారిద్దరూ పాఠశాలలో ఉంటే తాము పాఠశాలలోకి వచ్చేది లేదంటూ విద్యార్థులు ఇంటికి వెళ్లిపోయారు. సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆయన అవయవాలు సజీవం

● రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి
● అవయవదానానికి ముందుకు వచ్చిన కుటుంబీకులు


నాగరాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9: తనువు చాలించినా అవయవ దానంతో ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన మారెల్లి నాగరాజు (43) ఎంఏ, ఎంఎడ్ పూర్తి చేసి స్థానికంగా వ్యవసాయం చేస్తూ పాడి గేదెల పెంపకంతో కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఈ నెల 5న ఎల్లారెడ్డిపేట శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయలవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల పాటు నాగరాజు చికిత్స పొందాడు. ఆదివారం రాత్రి పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. కుటుంబ పెద్ద దూరమైనా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపాలని భావించిన కుటుంబ సభ్యులు అవయవదానం చేసేందుకు ముందుకొచ్చారు. జీవన్‌దాన్ సంస్థ ద్వారా కళ్లు, గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కాలేయం సేకరించారు. అక్కడి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నాగరాజు పార్థివదేహం వద్ద గౌరవ వందనం చేశారు. అనంతరం అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు. నాగరాజు బీఆర్ఎస్ కార్యకర్తగా కొనసాగేవాడు. గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, యువకులు భారీ ప్రదర్శన నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, స్థానిక నాయకులు నాగరాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి పాడే మోశారు. మృతుడికి తల్లి అనసూయ, భార్య వసుధ, రెండేళ్ల వయసు ఉన్న కొడుకు శివ్వ ఉన్నారు. తల్లి అనసూయ ఫిర్యాదు మేరకు రోడ్డు ప్రమాదానికి కారణమైన మండలంలోని కోరుట్లపేటలోని ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో నివాసం ఉంటున్న వ్యక్తి ఆలకుంట పాపయ్య తీవ్ర గాయాలపాలయ్యాడని పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పాపయ్య సైకిల్‌పై ఎల్లారెడ్డిపేట బస్టాండు ప్రాంతం నుంచి గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం వైపునకు వెళుతున్నాడు. ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లి వెళుతున్న కారు అతివేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. సమాచారం అందుకున్న ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

అడవిలో చెట్ల నరికివేత

● 8 మందిపై కేసు నమోదు

వీర్నపల్లి, సెప్టెంబర్ 9: వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలోని కొచ్చ గుట్ట బోరు, అందుగు చెట్టు బయిలు, కొమటి కుంట్ల ప్రాంతాల్లోని అడవిలో కొన్ని రోజులుగా చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. పోడు భూములు సాగు చేసేందుకు సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో అటవీ చెట్లను కొందరు దుండగులు నరికేశారు. ఓ వైపు ప్రభుత్వం హరితహారంలో చెట్లు నాటాలని చెబుతుంటే కొందరు అక్రమార్కులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వారి సొంత లాభం కోసం అటవీ సంపదను ధ్వంసం చేస్తున్న ఫారెస్ట్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గర్జనపల్లి సెక్షన్ పరిధిలోని పలు గ్రామాల్లో సిబ్బంది పోడు భూముల సాగుకు ఎకరానికి సుమారు లక్షకు పైగా ముడుపులు తీసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ పోడుభూమి సాగుకు తమ చెప్పిన ట్రాక్టర్‌నే వాడాలని చెప్పడం కొసమెరుపు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరారు.



అటవీభూమిలో నరికివేసిన చెట్లు

వన్‌పల్లిలో చెట్ల నరికివేత విషయంపై ఫారెస్ట్ సెక్షన్ అధికారి అయూబ్ ఖాన్ ను ఫోన్ ద్వారా వివరణ కోరగా అటవీ చెట్లను నరికిన విషయం తమ దృష్టికి వచ్చిందని, చెట్లను నరికింది ఎవరనే విషయంలో విచారణ చేసి 8 మంది పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అటవీ సంపదను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టాటా కర్వ్ కారును ఆవిష్కరించిన మంత్రి పొన్నం


కారును ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 9: నగరంలోని సెలెక్ట్ మోటార్స్ నందు నూతనంగా రూపొందించిన టాటా కర్వ్ కారును మంత్రి పొన్నం ప్రభాకర్, సెలెక్ట్ మోటార్స్ అధినేత ముప్పిడి విజయ్‌కుమార్‌రెడ్డిలు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సెలెక్ట్ మోటార్స్ అధినేత ముప్పిడి విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ టాటా కర్వ్ కారు పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ మోడల్స్‌లో లభ్యమవుతుందన్నారు. దీని ప్రారంభ ధర 9,99,000 నుంచి గరిష్టధర 18.99లక్షల వరకు లభిస్తుందన్నారు. ఈవి కారు ఒకసారి ఛార్జింగ్‌తో 585 కిలోమీటర్లు ప్రయాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టాటామోటార్స్ జోనల్ హెడ్‌నితాల్ శర్మ, షోరూం పార్ట్‌నర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రేకుర్తి కంటి ఆసుపత్రి సేవలు అభినందనీయం'

భగత్‌నగర్, సెప్టెంబరు 9: రేకుర్తి కంటి ఆసుపత్రి సేవలు అభినందనీయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఔట్ పేషెంట్‌వార్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏకైక ఛారిటబుల్ కంటి ఆసుపత్రి రేకుర్తి కంటి ఆసుపత్రి అన్నారు. ఆసుపత్రి అభివృద్ధికోసం తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఆసుపత్రిలోని పలు ఆధునికమైన పరికరాలను చూసి అభినందించారు. కట్రాక్ సర్జరీస్ లేకుండా రెటీనా, గ్లకోమా, మెల్లకన్ను సేవలను తెలుసుకుని ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఛైర్మన్ కొండా వేణుమూర్తి, చిదుర సురేష్, ప్రకాశ్ హోల్లా, బొమ్మ పవన్‌కుమార్, డాక్టర్ మురళీధర్‌రావు, కోలా అన్నారెడ్డి, ముక్క శరత్‌కృష్ణ,మ్యాడం శివకాంత్, లంబు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం తండ్రి సత్తయ్యగౌడ్‌కు ఘన నివాళి


పొన్నం సత్తయ్యగౌడ్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు9: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ 14వ వర్ధంతి కార్యక్రమం కరీంనగర్‌లో సోమవారం జరిగింది. మానేరు జలాశయం పక్కన వారి మామిడితోటలో పొన్నం సత్తయ్యగౌడ్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మక్కాన్‌సింగ్‌ఠాకూర్, ఎంపీ సురేష్‌షెట్కర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, హుస్నాబాద్, కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని బాధితుడి ఆందోళన

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: తనకు న్యాయం చేయాలని ఓ బాధితుడు ఆందోళనకు దిగాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం చిగురుమామిడి మండలం లంబాడిపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ళ మొండయ్య తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వారి నుంచి 20 సంవత్సరాల క్రితం ఎకరం 20 గుంటల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే తన ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోలేదన్నారు. అయితే ప్రస్తుతం భూముల విలువ పెరగడంతో తనకు భూమి అమ్మినవారు ఇపుడు తిరగపడుతున్నారని, అధికారుల అండతో తనకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చేందుకు సోమవారం ప్రజావాణికి వచ్చాడు. అయితే అక్కడే ఉన్న రెవెన్యూ అధికారిని చూసి వారి కారణంగానే తన భూమిని ఇతరుల పేరుపై రిజిస్ట్రేషన్ చేశారని ఆందోళనకు దిగాడు. సీఐ సరిలాల్ అతనితో మాట్లాడి అక్కడి నుంచి పంపించాడు.

బ్రాహ్మణకుంట శిఖం భూమిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చొప్పదండి, సెప్టెంబర్ 9: చొప్పదండిలోని బ్రాహ్మణకుంట శిఖం భూమి కబ్జాను అరికట్టాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ సోమవారం జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కుంట శిఖంలో 6 ఎకరాల భూమికి అక్రమంగా ఇచ్చిన పట్టా రద్దు చేయాలని, శిఖం భూమికి రీసర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని, ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్వోసీ ఇవ్వ కూడదని, తప్పుడు రిపోర్ట్ ఇచ్చిన అప్పటి తహసీల్దార్, సర్వేయర్, ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. చెరువు శిఖం భూమిని కబ్జా బారి నుంచి కాపాడాలని అయన ఫిర్యాదులో కోరారు.

జామే మస్జిద్ ఈద్గా కమిటీ సభ్యులకు సన్మానం

హుజూరాబాద్, సెప్టెంబరు 9: హుజూరాబాద్ పట్టణంలోని ఏక్‌మినార్‌లో నూతనంగా ఎన్నికైనా జామే మస్జిద్ ఈద్గా ఖబ్రస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ కార్యవర్గ సభ్యులను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్‌తో పాటు పాలకవర్గ సభ్యులను ముస్లింలు శాలువాలతో సత్కరించారు. జామే మస్జిద్ ఈద్గా అభివృద్ధి కోసం కృషి చేస్తానని ముజాహిద్ హుస్సేన్ అన్నారు. కార్యక్రమంలో మహ్మద్ జలాలుద్దీన్ అక్బర్, షేక్ నయీమ్, మౌలానా, ముజామిల్, నవాబ్‌ఖాన్, రహీం, ఆరిఫ్‌బేగ్, సల్మాన్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్మతిలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

తిమ్మాపూర్, సెప్టెం బరు9: స్థానిక జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్యోతిష్మతి విద్యాసంస్థల ఛైర్మన్ జువ్వాడి సాగర్‌రావు మాట్లాడుతూ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వాస్తవ ప్రపంచ సవాళ్లకు వినూత్న పరిష్కారాలను రూపొందించడానికి ఆవిష్క రణలను ప్రదర్శించడానికి విద్యార్థులకు ఒక నిర్ణయాత్మక వేదికగా ఉపయో గపడుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జువ్వా డి సుమిత్‌సాయి, ప్రిన్సిపాల్ కె.ఎస్.రావు, డీన్ పికే.వైశాలి, కన్వీనర్ ఎన్.వెంక టేశ్వరన్, కోఆర్డినేటర్ ఎం.మణికందన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జమ్మికుంట ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా శ్రీకాంత్‌రెడ్డి


డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

జమ్మికుంట, సెప్టెంబర్ 9: జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి ఇంచార్జి సూపరిండెంట్‌గా పారిపల్లి శ్రీకాంత్‌రెడ్డి నియమాకం అయ్యారు. సోమవారం ఇంచార్జ్ సూపరిండెంట్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న వనరులతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సర్జన్‌గా విధులు నిర్వర్తించడం జరుగుతుందని, కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడ బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం




కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బిర్లా ఓపెన్‌మైండ్ స్కూల్‌లో నివాళి, తీగలగుట్టపల్లి ఉన్నత పాఠశాలలో వివిధ వేషధారణలతో విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 9: కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సోమవారం పలు చోట్ల తెలంగాణా భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వావిలాలపల్లి విద్యాధరి స్కూల్లో తెలుగు భాషా పండిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాఠశాల చైర్మన్ జువ్వాడి వేంకటేశ్వరరావు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మౌనికా హరిచరణ్‌రావు, సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

●తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్, శంకర్‌ప్రసాద్ రేకుర్తి వద్ద కాళోజీ విగ్రహానికి నివాళులర్పించారు.

●తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో రేకుర్తి వద్ద కాళోజి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెరవే అధ్యక్షుడు సీవి కుమార్, డాక్టర్ వాసాల వరప్రసాద్, విలాసాగరం రవీందర్, ఎక్కలవేని మధుశ్రీ, బాలసాని కొమురయ్య, గుడికందుల అరుణ్, ఎండి ఖాలీద్, గసికంటి సంజీవ్ పాల్గొన్నారు.

●**కరీంనగర్ క్రైం:** పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో కాళోజీ చిత్రపటానికి అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ నివాళులర్పించారు. కార్యక్రమంలో సీసీఆర్‌బీ ఏసీపీ విజయ్‌కుమార్, ఆర్‌ఐలు రజినీకాంత్ (అడ్మిన్), కుమారస్వామి (ఎంటీఓ), శ్రీధర్‌రెడ్డి (వెల్ఫేర్), మినిస్టీరియల్ అధికారులు పాల్గొన్నారు.

●**భగత్‌నగర్:** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో కాళోజీ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాహిత్య రంగానికి కాళోజీ ఎనలేని కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తెలుగు ఉపాధ్యాయులను సత్కరించారు.

●తెలంగాణ భాష సాహిత్యాలతో విశేష కృషి చేసిన అక్షర తపస్వి కాళోజి నారాయణరావు అని సెయింట్‌జార్జ్, ప్యారడైజ్ పాఠశాలల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి అన్నారు. రేకుర్తిలోని ప్యారడైజ్ పాఠశాలలో కాళోజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్‌జార్జ్, ప్యారడైజ్ పాఠశాలల చైర్మన్ ఫాతిమారెడ్డి మాట్లాడుతూ కాళోజీ జయంతిని తెలంగాణ భాష దినోత్సవంగా ప్రకటించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ సీఈఓ ఉమాకాంత్, ప్రిన్సిపాల్ టీ.వసంత, భార్గవ్, నిరంజన్, వైస్ ప్రిన్సిపాల్ మధు పాల్గొన్నారు.

●ఆర్టీసీ కరీంనగర్ బస్‌స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్‌లు సత్యనారాయణ, భూపతిరెడ్డి, విజిలెన్స్ అధికారి భావ్‌రావు, చంద్రయ్య, వెంకటేశ్వర్లు, డిపో మేనేజర్లు మాధురి, మల్లయ్య, యుగంధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

●**కరీంనగర్ రూరల్:** కరీంనగర్ మండలం నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో కాళోజీ జయంతిని నిర్వహించారు. ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బూర్ల వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ మాలతి పాల్గొన్నారు.

●బొమ్మకల్ గ్రామంలోని బిర్లా ఓపెన్‌మైండ్ స్కూల్‌లో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కాళోజీని స్మరించుకుంటు విద్యార్థులు నృత్య గీతాలతో అలరించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ భాష యాస ప్రత్యేకత సంతరించుకుందన్నారు.

●నగరంలోని తీగలగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాళోజీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు తెలంగాణ తల్లి, పోతరాజుల వేషధారణలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు జి.వినోద, తెలుగు ఉపాధ్యాయురాలు ఎస్.శ్రీదేవి, ఉపాధ్యాయులు శ్రీలత, విజయలక్ష్మి, మెహర్‌ఉన్నీసా తదితరులు పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** హుజూరాబాద్ పట్టణంలోని శ్రీవాగ్దేవి డిగ్రీ కళాశాలలో కాళోజీ జయంతి సందర్భంగా మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి, రచయిత ఎస్ వెంకటేశ్వర్లు, ఏనుగు మహిపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నవీన్‌కుమార్, తిరుపతి, భద్రయ్య, అనిల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

●**శంకరపట్నం:** మొలంగూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈసందర్భంగా తెలుగు ఉపాధ్యాయురాలు ఆదిలక్ష్మిని హెచ్‌ఎం నీరజ సన్మానించారు.

●**ఇల్లందకుంట:** మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అనంతరం పాఠశాల స్పెషలాఫీసర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

●**జమ్మికుంట:** జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాళోజీ జయంతిని నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఓదేలు కుమార్, అధ్యాపకులు డాక్టర్ ఎమ్ శ్యామల, డాక్టర్ కె రాజేంద్రం, డాక్టర్ కె గణేష్, డాక్టర్ మాధవి, ఉమాకిరణ్, రాజ్‌కుమార్, కిరణ్‌కుమార్, డాక్టర్ ఈ రవి, పి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్ రవిందర్, డాక్టర్ సుష్మా, డాక్టర్ రవి పాల్గొన్నారు.

●**ఇల్లందకుంట:** మండల కేంద్రంలోని జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**చిగురుమామిడి:** మండలంలోని ఇందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాళోజీ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో జయప్రద, ఓదెలు, మంజుల, వేణు, చారి, మాధవి, శ్రీదేవి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, సెప్టెంబరు 9: 2024-25 సంవత్సరమునకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఎస్సీ విద్యార్థుల కోసం జాతీయ విదేశీ విద్యా ఉపకార వేతనం అను కొత్త పథకాన్ని ప్రారంభించిందని జిల్లా జిల్లా షెడ్యూల్డు కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు ఎం.నాగైలేశ్వర్ తెలిపారు. ఈ పథకంలో విదేశాలలో పీజీ, పీహెచ్‌డీ చేయుటకు అవకాశం కల్పిస్తామన్నారు. ప్రతి సంవత్సరం 125 మంది ఎస్సీ విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. కరీంనగర్ జిల్లాకి చెందిన ఎస్సీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు 9704011827 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కళాశాలకు వాటర్ కూలర్ బహూకరణ

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 9: నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ జూనియర్ కళాశాలకు సోమవారం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి వాటర్ కూలర్ బహూకరించారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల సంక్షేమమే లక్ష్యంగా త్వరలో కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలికి పోటీ చేస్తున్నానని నరేందర్‌రెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యవర్ధన్ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిధులు విడుదల చేయాలి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 9: వర్షాలతో నగర పాలక సంస్థ పరిధిలోని శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల డివిజన్లలో వరదలతో ప్రజలు ఇబ్బంది పడ్డారని, వరద నష్టం పథకం కింద 17 కోట్ల రూపాయలను విడుదల చేయాలని మేయర్ సునీల్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించామన్నారు. ఆ నిధులు వచ్చిన వెంటనే వరద ప్రభావిత ప్రాంతాల్లో పనులను చేపడతామని అన్నారు. సోమవారం ఆయన 13,32 డివిజన్లలో స్థానిక కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీవేణు, మర్రి భావనసతీష్‌తో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా ఆయన 13వ డివిజన్ బతుకమ్మకాలనీలో ఐదు లక్షల నిధులతో రజక సహకార సంఘ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం 32వ డివిజన్ అల్కాపురి, వివేకానంద కాలనీలో 18 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ లోయర్ మానేరు డ్యామ్‌కు భారీ వరద నీరు వచ్చి చేరినందున గతంలో మాదిరిగానే రెండురోజుల్లో ప్రతిరోజూ నల్లానీటిని అందిస్తామని ప్రకటించారు. నాలుగున్నరేళ్ళ తమ పాలనలో చాలా అభివృద్ధి చేశామని, మిగిలిన పనులను కూడా దశలవారిగా పూర్తిచేస్తామని సునీల్‌రావు ప్రకటించారు. ఈకార్యక్రమంలో డీఈ ఓంప్రకాశ్, ఏఈ వాణి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రవన్ పాల్గొన్నారు.

ఇళ్ల ముందే డ్రైనేజీ నీరు.. ఇబ్బందుల్లో ప్రజలు


గన్నేరువరంలో మురుగు నీటిని చూపిస్తున్న దేవవ్వ


మానకొండూర్ గణేష్‌నగర్‌లో నిలిచిన నీరు

గన్నేరువరం, సెప్టెంబరు 9: ఇళ్ల ముందు డ్రైనేజీ నీరు నిలిచిపోవడంతో దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తన ఇంటి ముందు ఉన్న డ్రైనేజీలో మురుగు నీటిని తొలగించకుంటే గ్రామ పంచాయతీలో నివాసం ఉంటానని గన్నేరువరం మండల కేంద్రంలోని రామంచ దేవవ్వ సోమవారం తన ఇంటి ముందు ఆందోళన చేపట్టింది. ఇంటి చుట్టూ డ్రైనేజీలో మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసనతో ఇంటిలో ఉండలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేసింది. డ్రైనేజీలో ఉన్న మురుగు నీటిని తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరింది.

మానకొండూర్ : మానకొండూర్‌లోని గణేష్‌నగర్‌లో మురికికాల్వలలో నిండిపోయిన వర్షం నీరు వెళ్లేందుకు దారి లేకపోవడంతో కాలనీవాసులుఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజులుగా కురిసిన వర్షం నీటితో పాటు కాలనీవాసులు వాడిన నీరు ఇరువైపులా ఉన్న మురికికాల్వలు పూర్తి స్థాయిలో నిండిపోయి రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్నాయి. మురికి కాల్వలు శుభ్రం చేయకపోవడంతోనే నీరు నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యానికి గురి కావల్సి వస్తోందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

చొప్పదండి, సెప్టెంబరు 9: వినాయక నవరాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు పడకంటి కృష్ణ అన్నారు. చొప్పదండిలో అయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండప పరిసరాల్లో శుభ్రత పాటించాలని అన్నారు. నాయకులు మోలుమురి రమేష్, దూస రాము, దండె లింగన్న, ఎన్నం మునిందర్, సిరిపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

● గన్నేరువరం: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీమార్కండేయ ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడి ముందు మహిళలందరూ సామూహిక కుంకుమ పూజలు సోమవారం వైభవంగా నిర్వహించారు.

నాగారపు శ్రీనివాస్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న నాగారపు శ్రీనివాస్

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 9: కరీంనగర్‌లో పలు ఆలయాల కార్య నిర్వహణాధి కారిగా పనిచేస్తున్న గంగాధర మండలం గోపాల్‌రావుపల్లి గ్రామానికి చెందిన నాగారపు శ్రీనివాస్ వినాయక, దసరా నవరాత్రి ఉత్సవాలు-2024లో భాగంగా సోమవారం హైదరాబాద్ త్యాగరాయ గానసభ, శ్రీసుబ్బరాయ కళావేదిక మీదుగా జనకళ వేములవాడ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ అందుకున్నారు. 1984లో గ్రామంలో చైతన్యయూత్ క్లబ్ స్థాపించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేశారు. అవార్డును జీనియస్ ఆల్ ఇండియా కో ఆర్డినేటర్ నరేందర్‌గౌడ్, ఇంటర్ నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్ట్స్ కో ఆర్డినేటర్ అంజయ్య చేతుల మీదుగా స్వీకరించారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు


కేంద్ర మంత్రిని సన్మానించిన నాయకులు

వీణవంక, సెప్టెంబర్ 9: మండలంలోని మాల్లారెడ్డిపల్లి బీజేపీ నాయకులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో మినరల్ ప్లాంట్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలుపగా సానుకులంగా స్పందించి ప్లాంట్ ఏర్పాటు చేయిస్తానాని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పుప్పాల రఘు, కర్రె నాని, కొలిపాక శ్రీనివాస్, అర్షం శ్రీనివాస్, పెద్దులు,సమ్మయ్య, తిరుపతి, వీరేందర్, హరీష్, సురేష్,కొంరయ్య, సంపత్ అనిల్ తదితరులున్నారు.

హత్యాచార నిందితులను అరెస్టు చేయాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మహిళా డాక్టర్లు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 9: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కలకత్తాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగి నెలరోజులు గడిచినా అసలు నిందితులను అరెస్టు చేయలేదని జాతీయ స్త్రీల వ్యాధుల నిపుణుల సంఘం (ఫాగ్సీ) బాధ్యులు అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని గీతాభవన్ చౌరస్తాలో ఫాగ్సీ ఆధ్వర్యంలో మహిళా వైద్యులు దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా డాక్టర్లు మాట్లాడుతూ జరిగిన సంఘటనపై విచారణ వేగ వంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో డాక్టర్ శ్రీలత, డాక్టర్ రేఖరాణి, డాక్టర్ శేషశైలజ, డాక్టర్ చంద్రమతి, డాక్టర్ హరికిషన్, డాక్టర్ తాత్విక, డాక్టర్ రవికాంత్, డాక్టర్ ఝాన్సి, డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నలిమెల భాస్కర్ దంపతులకు సన్మానం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 9: కాళోజీ అవార్డుకు ఎంపికైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్‌ను తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నలిమెల భాస్కర్ తెలుగు భాషకు, యాసకు పర్యాయపదంగా నిలుస్తున్నారని అన్నారు. నలిమెల భాస్కర్ మాట్లాడుతూ తన అభిరుచికి తగ్గట్లుగా సాహిత్య కృషి చేశానని అన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బొమ్మకంటి కిషన్, సభ్యులు నీలగిరి అనిత, తుమ్మల రమేశ్‌రెడ్డి, ఎం మహేందర్, పి సురేందర్, కె సత్యం, సాహితీ మిత్రుడు అశోక్ పాల్గొన్నారు.

చింతకుంటలో వైద్య శిబిరం

భగత్‌నగర్, సెప్టెంబరు9: కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామ పంచాయతీ ఆవరణలో ఆయుష్ యునాని వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యులు యస్రజ్ సుల్తానా మాట్లాడుతూ ఆహార సమతుల్యత పాటించాలన్నారు. వైద్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రవీణ్‌కుమార్, ఫార్మసిస్టులు మునీర్ సలీంముద్దీన్, ఎంఎన్‌ఓ సంజీవ్ రావు, పంచాయతీ సెక్రెటరీ మల్లేశం, కారోబార్ సత్య నారాయణరెడ్డి, ఏఎన్‌ఎం జుబేదాబేగం, ఆశవర్కర్ సరోజ, పేరుమాండ్ల శ్రీనివాస్‌గౌడ్, లచ్చయ్య శ్రీనివాస్‌గౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును తొలగించాలి

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు9: కరీంనగర్ మండలం దుర్శేడ్ గీత కార్మిక సంఘానికి ప్రభుత్వం కేటాయించిన భూమిలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డంపింగ్‌యార్డును నిర్మించిందని వెంటనే తొలగించాలని సోమవారం కలెక్టర్ పమేలా సత్పతికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గీత కార్మికులకు టీడీపీ ప్రభుత్వం హయాంలో సర్వే నంబర్ 96లో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించిందని తెలిపారు. ఈభూమిలో ఈత వనం, తాటి వనం పెంచుతున్నామన్నారు. డంపింగ్‌యార్డును వేరే చోటికి తరలించాలని కోరారు. ఈకార్యక్రమంలో గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు భూమయ్య, కనకయ్య, లింగయ్య, భూమయ్య హరీష్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

లాజిస్టిక్ పార్సిల్స్ వేలం

భగత్‌నగర్, సెప్టెంబరు 9: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ లాజిస్టిక్స్ కౌంటర్‌లో 40 రోజులు దాటిన పార్సిల్స్‌ను వేలం వేస్తున్నట్లు లాజిస్టిక్స్ ఏటీఎం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం, గురువారం కరీంనగర్-1 డిపో ముందు వేలం వేస్తున్నట్లు తెలిపారు.

'సంచలనాల కోసమే బండి సంజయ్ వ్యాఖ్యలు'

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 9: కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలనాల కోసమే స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే హైదరాబాద్ సెక్రటేరియట్‌పైన డోమ్‌లను కూల్చివేస్తామని రెచ్చగొట్టే విధంగా రాజకీయ అపరిపక్వతతో మాట్లాడడం సరైంది కాదన్నారు.

మండల ఎస్‌జీఎఫ్ క్రీడలు వాయిదా

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 9: కరీంనగర్ రూరల్ మండల లంలో సోమవారం నుంచి నిర్వహించాల్సిన ఎస్‌జీఎఫ్ క్రీడలను వాయిదా వేసినట్లు ఎంఈవో మధుసూదనాచారి తెలిపారు. సోమవారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియాన్ని వ్యాయాయ ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్‌లతో కలిసి పరిశీలించారు. వర్షాలతో క్రీడా మైదానం పూర్తిగా బురదమయం కావడంతో క్రీడలను వాయిదా వేసినట్లు తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని ఎంఈవో అన్నారు.

మృతికి నివాళి

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబర్ 9 : మండలంలోని సిర్సపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎడవెల్లి పద్మరెడ్డి తల్లి ఎడవల్లి వినోద ఈ నెల 8న మృతి చెందారు. మృతి వార్త తెలుసుకున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సొల్లుబాబు ఆదివారం రాత్రి గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. హనుమల్ల సమ్మిరెడ్డి, ఎడవెల్లి కొండాల్‌రెడ్డి, తునికి రవీందర్‌లు ఉన్నారు.

హరీశ్‌రావుపై విమర్శలు సరికాదు

జమ్మికుంట, సెప్టెంబర్ 9: మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సరికాదని తన్నీరు హరీష్‌రావు టీం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు అప్పని హరీష్‌వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి విపత్తులతో ప్రజలు అల్లాడుతుంటే వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

బాలికలకు కరాటే శిక్షణ ఇవ్వాలి

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 9: పాఠశాలల్లో బాలికల రక్షణ కోసం కరాటే శిక్షణ తరగతులు ఇప్పించాలని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్‌ను హుప్‌క్వాండో మార్షల్ ఆర్ట్స్ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కరాటే మాస్టర్ మహమ్మద్ మహమూద్ సోమవారం కలిసి కోరారు. అంతకు ముందు గ్రంథాలయ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

'నరేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలి'

హుజూరాబాద్, సెప్టెంబరు 9: అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని రెడ్డి జేఏసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. నరేందర్‌రెడ్డి ఎంతో మంది పేద విద్యార్థులకు అండగా నిలిచారని పేర్కొన్నారు. నరేందర్‌రెడ్డికి టికెట్ కేటాయిస్తే యువత కూడా ఉత్సాహంగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఏకాగ్రతతో చదివితే అద్భుత ఫలితాలు

రామడుగు, సెప్టెంబర్ 9: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే అద్భుత ఫలితాలు వస్తాయని మెమోరియల్ అండ్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్, వరల్డ్ రికార్డు హోల్డర్ దైవాల వేణుకుమార్ అన్నారు. మండలంలోని వెలిచాల సరస్వతి ఇంగ్లీష్ మీడియం, గోపాల్‌రావుపేటలోని శ్రీ ప్రగతి హైస్కూల్‌లో కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌పై సోమవారం ట్రైనింగ్ సెషన్ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్స్ ఉప్పుల శ్రీనివాస్, అన్నదానం రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

జిట్టాకు ఘన నివాళి

రామడుగు, సెప్టెంబర్ 9: మండలంలోని గోపాల్‌రావుపేటలో తెలంగాణ ఉద్యమ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి మృతికి సంతాపసూచకంగా సోమవారం యువజన జాతీయ అవార్డు గ్రహిత అలవాల విష్ణు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. బస్టాండ్ నుంచి మహాత్మా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.

డాక్టర్ భూంరెడ్డిని కలిసిన మంత్రి పొన్నం

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 9: కరీంనగర్‌లోని ప్రముఖ వైద్యులు భూంరెడ్డి నివాసానికి మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. భూంరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రిని డాక్టర్ భూంరెడ్డి, సూర్యనారాయణరెడ్డిలు శాలువాతో సన్మానించారు. మంత్రి వెంట నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి తదితరులున్నారు.